క్లుప్తంగా

హెల్త్ హాస్పిటల్స్ మెగా ఉచిత వైద్యశిబిరం



తెనాలి: పట్టణానికి చెందిన హెల్త్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని కుమార్ పంప్స్ అండ్ మోటార్స్ కంపెనీ సిబ్బంది, వారి కుటుంబసభ్యులకు ప్రత్యేకంగా ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. కుమార్ పంప్స్ సహకారంతో జరిపిన ఈ వైద్యశిబిరంలో గుండె వైద్యనిపుణులు డాక్టర్ ఎం.కవిత ప్రియాంక, జనరల్ మెడిసిన్ డాక్టర్ డి.శ్రీకాంత్, యూరాలజిస్ట్ డాక్టర్ ఎం.రామలింగేశ్వరరావు, న్యూరోసర్జన్ డాక్టర్ సత్యారెడ్డి, ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ నరేష్‌లు వైద్యపరీక్షలు చేశారు. మొత్తం 180 మందికి బీపీ మధుమేహం, ఈసీజీ, ఎముకల పటుత్వం, ఊపిరితిత్తుల సామర్థ్యం, నరాల సామర్థ్యం పరీక్షలు చేశారు. అవసరమైన సలహాలను ఇచ్చారు. ఆరోగ్యసమస్యలు తలెత్తకుండా నివారణపై అవగాహన కల్పించారు. కుమార్ పంప్స్ అండ్ మోటార్స్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. హెల్త్ హాస్పటల్ సీఈవో గిరిబాబు పర్యవేక్షించారు.

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు

తెనాలిరూరల్: యువకుడు అదృశ్యమవడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ చినరావూరుకు చెందిన 24 ఏళ్ల హేమంత్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. జూన్ 30 రాత్రి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించగా వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



తెనాలిఅర్బన్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఈ.విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఆర్టీసీ డిపో ఆవరణలో కొద్దిసేపు శుక్రవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న 11వ పీఆర్‌సీకి సంబంధించిన బకాయిలు చెల్లించాలని కోరారు. బస్సులు బ్రేక్ డౌన్ అయినప్పుడు గ్యారేజి సిబ్బందిని బాధ్యులుగా చేసే విధానాన్ని నిలిపివేయాలని తెలిపారు. అలాగే 12వ పీఆర్‌సీకి సంబంధించిన కమిషన్‌ను వెంటనే ప్రకటించాలని కోరారు. సమావేశంలో జోనల్ నాయకులు పి.యలమంద, ఐమళ్ళ రాజేష్ ఖన్నా, డిపో అధ్యక్ష కార్యదర్శులు కె.బాబు, ఎన్.సుధాకర్, గ్యారేజ్ అధ్యక్ష కార్యదర్శులు వి.జోషిబాబు, డి.శ్రీనివాసరావు, నాయకులు పి.వీరయ్యబాబు, టి.ధనుంజయరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేని విత్తనాలు విక్రయిస్తే చర్యలు

ప్రత్తిపాడు: రైతులకు అనుమతులు లేని విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి షేక్ సుగుణ భేగం హెచ్చరించారు. గొట్టిపాడులోని విత్తన దుకాణాల్లో శుక్రవారం ఏవో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విత్తన డీలర్ల లైసెన్సులు, ఇన్‌వాయిస్‌లు, స్టాక్ రిజిస్టర్లు, బిల్ పుస్తకాలను ఆమె పరిశీలించారు స్టాక్ బోర్డు, ధరల వివరాలను దుకాణం ఎదుట ప్రదర్శించాలని ఆదేశించారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్‌కు అర్హత ఉండి.. జాబితాల్లో పేర్లు లేని రైతులు రైతు సేవ కేంద్రంలో సంప్రదించాలన్నారు.

పరిష్కరించకుంటే.. ఉద్యమిస్తాం

అగ్నిబాధిత పసుపు రైతుల సంఘం ఏకగ్రీవంగా తీర్మానం



మాట్లాడుతున్న జొన్నా శివశంకరరావు

తెనాలి: అగ్నిబాధిత పసుపు రైతుల పరిహారం కోసం మంత్రి నారా లోకేష్‌ను కలిసిన తర్వాత తగిన న్యాయం జరగకపోతే ఉద్యమ కార్యాచరణ చేపట్టాలని పుసుపు రైతుల సంఘం ఏకగ్రీవంగా తీర్మానించింది. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా గల ఎస్‌డబ్ల్యుఎఫ్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన దుగ్గిరాల కోల్డ్‌స్టోరేజీ అగ్నిబాధిత పసుపు రైతుల సమావేశానికి కన్వీనర్ వేములపల్లి వెంకట్రామయ్య అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ పసుపు రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ 2024 జనవరి 19న దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజీలో అగ్నిప్రమాదం కారణంగా దాదాపు లక్ష బస్తాల పసుపు కాలిపోయిందని గుర్తుచేశారు. ఫలితంగా రూ.100 కోట్ల ఆస్తినష్టం జరిగిందన్నారు. గతేడాది మంత్రి అచ్చం నాయుడు సమక్షంలో విజయవాడ మార్క్‌ఫెడ్ కార్యాలయంలో క్వింటాలుకు రూ.7,000 వంతున పరిహారం ఇవ్వాలన్న నిర్ణయం అమలుకాలేదని తెలిపారు. తిరిగి జూన్ నెల 12వ తేదీన గుంటూరు వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సమక్షంలో జూన్ నెలాఖరులోపల రైతులకు స్లిప్పులు పంపిణీ చేస్తామని చెప్పిన హామీ కూడా అమలుకాలేదని వివరించారు. ఈ హామీల అమలుకు దుగ్గిరాల ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను కలిసి, ఆయన స్పందన ప్రకారం రైతాంగం అభిప్రాయంపై తగిన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. వేముపల్లి వెంకట్రామయ్య మాట్లాడుతూ అగ్నిప్రమాదం జరిగినప్పటి నుంచి ఇప్పటి వరకు 17 నెలల కాలంలో ప్రజాప్రతినిధులు, అధికారులను 13 పర్యాయాలు రైతాంగం కలిసినట్టు గుర్తుచేశారు. ప్రమాదం జరిగిన సమయంలో మార్కెట్లో పసుపు క్వింటాలు రూ.14 వేలు ధర ఉందన్నారు. అయినా మంత్రి అచ్చెన్నాయుడు సమక్షంలో కేవలం రూ.7,000లకు రైతులు ఒప్పందం చేసుకున్నారని చెప్పారు. అయినా ఇప్పటికీ అమలు కాకపోవటం దురదృష్టకరమన్నారు.

ఇప్పటికైనా ప్రభుత్వం బాధ్యత వహించి రైతాంగానికి న్యాయం చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ పసుపు రైతుల కమిటీ రాష్ట్ర కమిటీ సభ్యుడు ములకా శివ సాంబిరెడ్డి మాట్లాడుతూ కమిటీల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేయకుండా సత్వరమే బాధిత పసుపు రైతులకు పరిహారం ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే రైతాంగం ఆందోళనకు సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో గుళ్లపల్లి వెంకట సుబ్బారావు, లంకిరెడ్డి నాగేశ్వర్‌రెడ్డి, నాదెళ్ల చంద్రశేఖరరావు, పోతరాజు కోటేశ్వరరావు, ఎన్.సురేంద్ర, ఆళ్ల వేణుగోపాల్ రెడ్డి, కుర్రే సాయిరాండరెడ్డి, మద్దన సాంబశివరావు, రాజేష్, భాస్కర్‌రెడ్డి, ఎస్.శ్రీరామమూర్తి, కె.శేషు ప్రసాద్, ఎ.గోవిందరెడ్డి, గుదిబండి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రాజకీయ దురంధరుడు కొణిజేటి రోశయ్య



ఆర్యవైశ్య సత్రం కమిటీ ఆధ్వర్యంలో రోశయ్యకు నివాళి



ఆర్యవైశ్య సంఘాల చే రోశయ్యకు పుష్పాంజలి



ఎస్‌ఆర్‌కే, కేఎస్‌ఆర్ గుప్తా డిగ్రీ కాలేజీలో...



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తెనాలిలో 92వ జయంతికి ఘననివాళులు

తెనాలి: తన వ్యక్తిత్వం, మేధస్సుతో రాష్ట్ర రాజకీయాల్లో అన్ని పదవులను చేపట్టిన రాజకీయ దురంధరుడు కొణిజేటి రోశయ్య అన్నింటిలోనూ తనదైన శైలితో రాణించారని పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు నివాళి అర్పించారు. మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య 92వ జయంతి రోజైన శుక్రవారం స్థానిక బోసురోడ్డులోని రోశయ్య నిలువెత్తు కాంస్య విగ్రహానికి శ్రీవాసవీ దేవస్థానం సత్రం కమిటీ ఆధ్వర్యంలో పూలమాలలు సమర్పించి, నివాళులర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీలో రికార్డు సంఖ్యలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థికశాఖ మంత్రిగా ఘనతను సాధించిన రోశయ్య, ఆ తర్వాత ముఖ్యమంత్రిగా, తమిళనాడు రాష్ట్ర గవర్నర్‌గా పనిచేసినట్టు గుర్తుచేశారు. ఎవరినీ నొప్పించక తన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించిన గుర్తింపును సాధించిన రోశయ్య రాజకీయంగా అజాతశత్రువుగా వక్తలు గుర్తుచేశారు. ఆర్యవైశ్య జాతి కోసం అనేక కార్యక్రమాలను చేపట్టారని సోదాహరణంగా వివరించారు. రోశయ్య విగ్రహాన్ని ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో తొలిగా తెనాలిలో నూకల వెంకట వేణుగోపాలరావు, నంబూరి వెంకట కృష్ణమూర్తి ఇక్కడ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్టు గుర్తుచేశారు. కార్యక్రమంలో గ్రంధి వెంకట విశ్వేశ్వరరావు, మద్దాళి శేషాచలం, కొణిజేటి శంకరరావు, ఆకి అచ్యుతరావు, మువ్వల శ్రీనివాస్, కొణిజేటి గోపీకృష్ణ, సాధు ప్రతాప్, కౌన్సిలరు గొడవర్తి సాయిహరేరామ్, భాస్కరుని శ్రీనివాసరావు, నూకల వెంకట భాస్కర్, భాస్కరుని లక్ష్మీనారాయణ, చుండూరు సాయి తదితరులు పాల్గొన్నారు. అనంతరం తెనాలి బండ్‌పై గల కొణిజేటి రోశయ్య కాంస్య విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు.

ఆర్యవైశ్య సంఘాల పుష్పాంజలి

తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య 92వ జయంతి సందర్భంగా పలు ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో స్థానిక బోసురోడ్డులోని రోశయ్య కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ పెండేల వెంకట్రావు, పెండేల సుబ్బారావు, తాతా శ్రీనివాసరావు, శ్రీరామ్‌రాజా, గుర్రం భాస్కర్ వెంకటసుధీర్, గోనుగుంట్ల శ్రీనివాసరావు, తాళ్లూరి శ్రీరామచంద్రమూర్తి, గుప్త తదితరులు పాల్గొన్నారు.

గుప్తా డిగ్రీ కాలేజీలో...

తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య 92వ జయంతిని స్థానిక ఎస్‌ఆర్‌కే అండ్ కేఎస్‌ఆర్ గుప్తా డిగ్రీ కాలేజీలో ఘనంగా జరిపారు. ప్రిన్సిపాల్ గోగినేని విజయకృష్ణ, అధ్యాపకులు రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. బి.శ్రీనివాసరావు, ఎం.దశరథ రామిరెడ్డి, కేవీ రవికుమార్, ఆర్‌వీ సునీత, డి.రోశయ్య, ఎ.నాగరాజు, వి.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తెనాలిటౌన్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్‌పార్టీ తెనాలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చందు సాంబశివుడు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మారీసుపేటలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 92వ జయంతిని ఆ పార్టీశ్రేణులు ఘనంగా నిర్వహించారు. డాక్టర్ చందు సాంబశివుడు పాల్గొని రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్థిక మంత్రిగా, ముఖ్యమంత్రిగా, గవర్నర్‌గా కాంగ్రెస్‌పార్టీలో ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. రోశయ్య జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పి.నాగసూర్యశశిధరరావు, జి.ద్వారక శ్రీనివాస్, కె.బుల్లయ్య, పెనుగొండ శివకుమార్, భీమా రమేష్, స్టీవెన్ బాబు, కోటేశ్వరరావు, రాయప్ప, వీరాస్వామి, అయ్యప్ప, నాగూర్, కార్తీక్, పూలే రామ్, సాయి, మల్లిఖార్జున, పూర్ణచంద్ర, కృష్ణ, శ్రీను, తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



తెనాలిఅర్బన్: ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పట్టణంలోని 12వ వార్డులో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక పారిశుద్ధ్య పనులను ఆమె పరిశీలించి సూచనలు చేశారు. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కొర్రా యశోద, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మువ్వా యేసు బాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనుపమ, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అక్రమంగా రేషన్ బియ్యం తరలింపు

పెదకాకాని: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరి వ్యక్తులను అదుపులోకి తీసుకున్న సంఘటన నంబూరు అడ్డరోడ్డు వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గుంటూరు నల్లచెరువుకు చెందిన ఏరువ వివేకానందరెడ్డి, తల్లపురెడ్డి సుధాకరరెడ్డిలు దుగ్గిరాల నుంచి 50 కిలోలు గల 85 రేషన్ బియ్యం బస్తాలను పెదకాకాని మండలం, నంబూరు మీదుగా చిలకలూరిపేట తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ముందస్తు సమాచారం మేరకు తనిఖీలు చేపట్టిన పోలీసులు గురువారం అర్ధరాత్రి వారిని అదుపులోకి తీసుకుని రేషన్‌బియ్యం స్వాధీనం చేసుకున్నారు.

ఇంటి వద్దనే చెత్తను వేరు చేయాలి

ప్రత్తిపాడు: ఇంటి నుంచి ఉత్పన్నమయ్యే వ్యర్థాలను తడి చెత్త, పొడి చెత్తగా ఇంటి వద్దనే మహిళలు వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని ఎంపీడీవో కె.శివపార్వతి అన్నారు. మండల పరిధిలోని కొత్తమల్లాయపాలెంలో శుక్రవారం ఎంపీడీవో స్థానిక పంచాయతీ కార్యదర్శి ఈదా వీఎస్ రెడ్డితో కలిసి ఇంటింటికీ తిరిగి చెత్త నిర్వహణపై అవగాహన కల్పించారు.

వేర్వేరు రంగాల ప్రముఖులకు నివాళులు



రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న రమణరావు, మురళి



నివాళులర్పిస్తున్న తెనాలి కల్చరల్ ఫిల్మ్ సొసైటీ సభ్యులు



డాక్టర్ సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైద్యులు



నివాళులర్పిస్తున్న అల్లూరి యువసేన

తెనాలిరూరల్: ఇటీవల మృతి చెందిన బాపూజీ హాస్పిటల్ అధినేత, ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ ఎంవీ సుబ్బారావు సంస్మరణ సభ ఐఎంఏ తెనాలి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా బోస్ రోడ్డులోని ఐఎంఏ కార్యాలయంలో పలువురు వైద్యులు డాక్టర్ సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఐఎంఏ తెనాలి అధ్యక్షుడు డాక్టర్ కె. అనిల్ కుమార్, జనరల్ సెక్రెటరీ డాక్టర్ మధు ప్రభాకర్ బాబు, కోశాధికారి డాక్టర్ కొత్తమాసు శ్యాం ప్రసాద్, సీనియర్ వైద్యులు డాక్టర్ గంట నరసింహారావు , డాక్టర్ పాలడుగు ఉమామహేశ్వరరావు, డాక్టర్ ఎంవీ సత్యనారాయణ, డాక్టర్ రమేష్, డాక్టర్ శేషగిరిరావు , డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ గవిని రవిశంకర్, డాక్టర్ శివరామకృష్ణ పాల్గొన్నారు.

తెనాలిటౌన్: సినీ నటుడు ఎస్వీ రంగారావు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు సేవలు చిరస్మరణీయమని తెనాలి కల్చరల్ ఫీల్మ్ సొసైటీ సభ్యులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక నందులపేటలోని సీపీఐ కార్యాలయంలో తెనాలి కల్చరల్ ఫీల్మ్ సొసైటీ, అభ్యుదయ కళాసమితి సంయుక్త ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు, ఎస్వీ రంగారావు జయంతి సభ ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర్య కోసం అల్లూరి సీతారామరాజు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. సినీ రంగంలో ఎస్వీ రంగారావు సేవలు ముదావహమని కొనియాడారు. కార్యక్రమంలో దేవరపల్లి నీలాంబరం, బొల్లిముంత కృష్ణ, తాడికొండ జగన్ మోహనరావు, పాతూరి సుబ్రమణ్యం, ఎంవీ రఘునాథరావు, విజయసారథి, కన్నెగంటి మధు, శ్రీదేవి, విజయలక్ష్మి ఉన్నారు.

తెనాలిఅర్బన్ : బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి వంగావీటి మోహనరంగా చేసిన కృషి మరువరానిదని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తోటకూర వెంకటరమణరావు కొనియాడారు. రంగా జయంతిని పురస్కరించుకుని వల్లెం మురళి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో నందులపేటలోని ఆయన విగ్రహానికి శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా విజయవాడ అభివృద్ధికి కృషి చేశారని చెప్పారు. అలాగే పేద ప్రజలకు ఎటువంటి కష్టం వచ్చిన ముందుడే వాడని చెప్పారు. ఆయన బాటలో అందరూ నడవాలన్నారు. కార్యక్రమంలో దాది సూరయ్య, గ్యాలం వేణు, శిల్పుల శ్రీను, ఎన్‌వి. చెన్నయ్య, టి.సుధాకర్, డి.శ్రీనివాస్, షేక్ కాలేషా, ఎన్.రాంబాబు, అకేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

తెనాలిటౌన్: స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అగ్ని పిడుగు అల్లూరి సీతారామరాజు దేశానికి చేసిన సేవలు ఆదర్శనీయమని అల్లూరి సీతారామరాజు యువసేన పేర్కొన్నారు. రూరల్ మండలం కఠెవరం గ్రామంలో రాజుల కాలనీ నందు అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. అల్లూరి యువసేన సభ్యులు పాల్గొని విప్లవవీరుడు సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుందామని యువసేన ప్రతిజ్ఞ చేశారు.

కార్యక్రమంలో పూసపాటి శ్రీనివాసరాజు, కడిమెళ్ళ నరసరాజు, పూసపాటి విజయరామరాజు, పూసపాటి కార్తీక్‌రాజు, మహేంద్రవర్మ, జయేంద్ర వర్మ, వీరాంజనేయరాజు, శ్రీకాంత్, మనోహర్, దళపతి, అజయ్, రఘువర్మ, హర్షవర్ధన్, భాస్కర్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఐపీఏ ఏఎస్ఎన్ స్టూడెంట్ చాప్టర్‌తో అవకాశాలు



చాప్టర్‌లోని నూతన సభ్యులు

తెనాలి: స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మసీ కాలేజీలో శుక్రవారం ఇండియన్ ఫార్మస్యూటికల్ అసోసియేషన్–ఏఎస్ఎన్ చాప్టర్ 2025–26 సంవత్సర నూతన బృందం పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల సామర్థ్యాన్ని, నాయకత్వ నైపుణ్యాలను పెంపొందించే ఉద్దేశ్యంతో ఏటా కొత్త బృందాన్ని ఎన్నుకోవటం ఆనవాయితీగా చెబుతూ ఈ ఏడాది కూడా అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ కొత్త బృందాన్ని ప్రారంభించినట్టు కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ చెప్పారు. కొత్త బందాన్ని ఎన్నుకోవడం ఆనవాయితీగా సాగుతోంది. ఈ సంవత్సరం కూడా అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఒక కొత్త బృందాన్ని ప్రారంభించింది. ఈ కొత్త టీమ్ ద్వారా విద్యార్థులకు మరిన్ని అవకాశాలు, శిక్షణలు, పరిశ్రమలతో అనుసంధానం కలుగుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. మెంటార్ పి. భార్గవి, చాప్టర్ ప్రెసిడెంట్ ఎస్.సునీల్ కుమార్ అధ్యక్షత వహించారు. పలువురు అధ్యాపకులు, విద్యార్థులు మాట్లాడారు.

కాలుష్య నివారణకు మొక్కలు దోహదం



తెనాలిఅర్బన్: కాలుష్య నివారణకుమొక్కలు దోహదపడతాయని ప్రిన్సిపల్ సిస్టర్ శాంతి పేర్కొన్నారు. జాతీయ సేవా పథకం కార్యక్రమంలో భాగంగా జెఎంజె కళాశాలలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్లకు ఇరువైపులా కళాశాలలో వీటిని నాటడం వలన ఆరోగ్యాన్ని కాపాడవచ్చని చెప్పారు. పర్యావరణ పరిరక్షణకు ఇవిఎంతో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ రోజిలీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ దాసరి విజయలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

అవగాహనతోనే దోమల నిర్మూలన సాధ్యం



మాట్లాడుతున్న డాక్టర్ రమాదేవి

తెనాలిఅర్బన్: అవగాహనతో దోమల నియంత్రణ సాధ్యమవుతుందని గంగానమ్మపేటలోని అర్బన్‌హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ దేవరపల్లి సుభాష్ రమాదేవి పేర్కొన్నారు. డెంగ్యూ నివారణ మాసోత్సవాల్లో భాగంగా ఐతానగర్‌లోని ఎన్ఎస్ఎస్ఎంహెచ్ స్కూల్‌లో శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమలు కుట్టడం వలన డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా, విషజ్వరాలు వంటివి ప్రబలే అవకాశం ఉందన్నారు. అధిక జ్వరం, కన్నుగుడ్లు వెనుక నొప్పి, కండరాలు, ఒళ్లు నొప్పులు, శరీరంపై దదుర్లు వంటివి డెంగ్యూ లక్షణాలు అని చెప్పారు. ఈ లక్షణాలు ఉన్నవారు వెంటనే వైద్యశాలలో చికిత్స పొందాలన్నారు. సమావేశంలో తెనాలి పట్టణ, మండల మలేరియా సబ్ యూనిట్ అధికారులు శ్రీకంఠ ఉమాకాంత్, పున్నారెడ్డి, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, ప్రధానోపాధ్యాయులు శాఖమూరి రాజ్యలక్ష్మి, దాసరి శివనాగమల్లేశ్వరరావు, శరత్‌బాబు, నవీద్, తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో ఆక్రమణలు తొలగించండి

మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం.లక్ష్మీపతిరావు



సూచనలిస్తున్న మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ లక్ష్మీపతిరావు

తెనాలిఅర్బన్: ఆక్రమణలను వెంటనే తొలగించాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం.లక్ష్మీపతిరావు ఆదేశించారు. పట్టణంలోని మార్కెట్ ఏరియాలో శుక్రవారం ఉదయం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లపై ఎక్కడ వ్యర్థాలు కనిపించకూడదన్నారు. ఉదయాన్నే చెత్త సేకరణ జరగాలని సూచించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.